క్లుప్తంగా

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



అంబాజీపేటలో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: రోడ్డు నిర్మాణ పనుల్లో ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. స్థానిక పెద్దవీధిలో అంబాజీపేట నుంచి బోడసకుర్రు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. త్వరితగతిన గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు నిర్మాణాలు చేపట్టనున్నామన్నారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, మైలా ఆనందరావు, గంటి శ్రీరామచంద్రమూర్తి, నాగాబత్తుల శశి తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

సైకిల్ తొక్కండి.. ఆరోగ్యాన్ని కాపాడుకోండి



కొత్తపేట సచివాలయం-3 నుంచి సైకిల్ ర్యాలీ

కొత్తపేట: సైకిల్ తొక్కండి.. ఆరోగ్యాన్ని కాపాడుకోండి అంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ మండలంలోని అవిడి పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య అభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు అవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి ఇందిరాభారతిరాయి ఆధ్వర్యంలో మండలంలోని సచివాలయాల వద్ద నుంచి సైకిల్ తొక్కండి, ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోండి, ప్రకృతిని కాపాడండి, అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. సైకిల్ తొక్కడం ద్వారా ఒత్తిడి తగ్గుతుందని, గాఢనిద్ర పడుతుందని, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని, గుండె రోగనిరోధక శక్తి పెరుగుతుందని తదితర సంపూర్ణ ఆరోగ్య ఫలితాలు చేకూరుతాయని వివరించారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా అధ్యక్షుడిగా అడబాల



అడబాల సాయి

పి.గన్నవరం: నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) జిల్లా అధ్యక్షుడిగా పి.గన్నవరం మండలానికి చెందిన అడబాల సాయి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ పి.సంపత్ కుమార్ నియామక ఉత్తర్వులు ఇచ్చారని సాయి వివరించారు. మానవహక్కుల ఉల్లంఘన జరగకుండా తనవంతు పోరాటం సాగిస్తానని సాయి అన్నారు.

మహిళలకు రాయితీపై వైద్య సేవలు

అంబాజీపేట: ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక స్త్రీల (మిస్సమ్మల), కంటి ఆస్పత్రిలో మహిళలకు ప్రత్యేక రాయితీలపై వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆస్పత్రి సీఈఓ ఎస్.ఆర్.కె.హెవార్డ్‌రాజు చెప్పారు. స్థానిక ఆస్పత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రికి వచ్చే మొదటి 50 మంది మహిళలకు ఒక్క రూపాయికే ఓపీ, అవసరమైన వారికి 100లకే స్కానింగ్, దంత వైద్య విభాగంలో అన్ని రకాల ట్రీట్‌మెంట్‌లపై 25 శాతం తగ్గింపును ఇస్తామన్నారు. లీజర్ రైట్ ఐ కేర్ ఆస్పత్రిలో మహిళలకు వైద్య సేవల్లో రాయితీ కల్పిస్తామన్నారు. వైద్యులు ఎస్‌ఆర్ ఆర్ విజయశ్రీ, వి.శిరీషా, జయశ్రీ, జయరామ్‌జీ బాబు, కె.భరత్, ఎస్.షయినీ, హెర్నిస్ జెడిడా, వి.మనోహర్ పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



మృతుడు నాగిరెడ్డి సత్తిబాబు (ఫైల్)

అయినవిల్లి: మండలంలోని మడుపల్లి సమీపాన రాయుడు పాలెంలో శుక్రవారం సాయంత్రం అదుపు తప్పి ఓ గూడ్స్ వ్యాన్ కాలువలో బోల్తా పడిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ ఘటన ఏడుగురు స్వల్పగాయాలతో బయటపడగా వీరిని 108లో అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. మరొకరు కొత్తపేట మండలం వానపల్లికి చెందిన నాగిరెడ్డి సత్తిబాబు (30) గల్లంతయ్యాడు. ఆదివారం అతడి మృతదేహం మండలంలోని కొండుకుదురు, ముమ్మిడివరం మండలం పళ్లవారిపాలెం సరిహద్దులో పంట కాలువ గోడితూములో దొరికింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి అయినవిల్లి పోలీసులు పంచనామా నిర్వహించారు. ముమ్మిడివరం సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై ఎస్. నాగేశ్వరరావు తెలిపారు.

దివ్యాంగులకు భవిత

- మండలానికో కేంద్రం
- ఉచితంగా పరికరాల పంపిణీ



మాచవరం భవిత కేంద్రంలో దివ్యాంగ బాలుడికి ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యులు, భవిత సిబ్బంది

అంబాజీపేట: అవసరాలు గల పిల్లలపై ప్రభుత్వం దృష్టి సారించింది. సాధారణ పిల్లలతో కలసి వారు సాగేలా చర్యలు చేపడుతోంది. గృహస్థాయిలో ఫిజియోథెరపీ అందిస్తోంది. ఆర్థిక తోడ్పాటు కూడా కల్పిస్తూ దివ్యాంగుల భవితకు భరోసా ఇస్తోంది. ఇలాంటి చిన్నారుల వికాసానికి భవిత కేంద్రాల్లో ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టింది. ఆ కేంద్రాల్లో ప్రత్యేక వాతావరణం ఉండేలా చేస్తోంది. వారిలో దాగిన సృజనాత్మకతను వెలికితీస్తుంది. అందరి పిల్లలతో కలసి దివ్యాంగులు జీవనం సాగించేందుకు ఐఈఆర్టీలు ప్రత్యేక దృష్టి సారించేలా ఆదేశాలు జారీ చేసింది. పి.గన్నవరంలో 15 మందికి 9, అయినవిల్లిలో 12 మందికి 10, మామిడికుదురులో 20 మందికి 15, అంబాజీపేటలో 14 మందికి 10, రాజోలులో 21 మందికి 16, మలికిపురంలో 16 మందికి 12, సఖినేటిపల్లిలో 14 మందికి 10, కొత్తపేటలో 16 మందికి 17, రావులపాలెంలో 15 మందికి 10, అత్రేయపురంలో 24 మందికి 15 మంది విద్యార్థులు భవిత కేంద్రాలకు వస్తున్నారు. ఒక్కో భవిత కేంద్రంలో ఒక ఐఈఆర్టీ, ఆయాను నియమించారు. వారానికోసారి ఈ కేంద్రాలకు ఫిజియోథెరపిస్ట్ వచ్చి వారితో వ్యాయామం చేయిస్తారు. దీంతో పాటు వ్యాయామం ఎలా చేయించాలో వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. ప్రతి శనివారం కదల్లేని వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు పలు అంశాలను వివరిస్తారు. ఫిజియోథెరపిస్టు వచ్చే సమయానికి భవిత కేంద్రానికి వచ్చేలా విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి సేవలు అందిస్తున్నారు.

అందుతున్న సేవలివి...

విద్యా, ఫిజియోథెరపీతో పాటు భవిత కేంద్రాలకు వచ్చే ప్రత్యేక అవసరాలు గల బాలబాలికలకు, ఇంట్లో ఉన్నవారికి నెలకు రూ.250 చొప్పున ఏడాదిలో పది నెలల పాటు ప్రభుత్వం అలవెన్సు అందిస్తోంది. బాలికలకు ప్రత్యేకంగా పది నెలల కాలానికి రూ.2,500 ఫండ్ రూపంలో ఇస్తున్నారు. మానసిక దివ్యాంగులకు రూ.7 వేల విలువైన ఎంఆర్ కిట్లను ప్రభుత్వం ఉచితంగా ఇస్తోంది. మధ్యాహ్న భోజన పథకంతో పాటు బస్‌పాస్‌లు, వినికిడి యంత్రాలు, చక్రాలు కుర్చీలు అందిస్తున్నారు. విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందించి వారిలో చైతన్యం నింపుతున్నారు.

మార్పు తీసుకొచ్చేందుకు..



తల్లిదండ్రులు ప్రత్యేక అవసరాలు కలిగిన తమ పిల్లలను భవిత కేంద్రానికి తీసుకొచ్చేలా సేవలు వివరాలు తెలుపుతున్నాం. క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ అందించి వారిలో మార్పు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. భవిత కేంద్రాల్లో పిల్లలకు ప్రభుత్వ పరంగా అందిస్తున్న ఉచిత పథకాలను గుర్తించి తెలియజేస్తున్నాం.

– ఎంపీపీ సత్యనారాయణ, ఐఈ వింగ్ కో ఆర్డినేటర్, అమలాపురం

దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ



భవిత కేంద్రానికి వస్తున్న దివ్యాంగ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. పిల్లల మనోభావాలను అనుసరించి వారికి పాఠాలు చెబుతున్నాం. ఆట పాటలతోనూ వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు కృషి చేస్తున్నాం. వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు శిక్షణ ఇస్తున్నాం. తరచూ ఆటలు పోటీలు నిర్వహించి చైతన్య పరుస్తున్నాం.

– ఎస్‌కే బేగం, భవిత కేంద్ర ఐఈఆర్టీ, మాచవరం

గణపతి ఆలయంలో పెన్నుల పూజ



వక్కలంకలో విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రేవతి, స్థానికులు

అంబాజీపేట: వక్కలంక గ్రామంలో వేంచేసిన లక్ష్మీగణపతి ఆలయం వద్ద ఆలయ కమిటీ సమకూర్చిన 1000 పెన్నులకు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అత్యంత వైభవంగా పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు హనుమాన్‌శర్మ పర్యవేక్షణలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, 1000 పెన్నులకు పూజలను నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పెన్నులను పంపిణీ చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి రేవతి, ఎంపీటీసీ పిల్లి సత్యవేణి, వైఎస్సార్ సీపీ నాయకులు వాసంశెట్టి పెదబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాసంశెట్టి వరలక్ష్మి, వాసుదేవానంద భారతీ స్వామి, పితాని సూరిబాబు, మట్టపర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగిన వెంకన్న



రావులపాలెంలో సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

రావులపాలెం: అలివేలు మంగా పద్మావతి ఆండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి 14వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహోత్సవాల్లో భాగంగా ఏడో రోజు ఆదివారం స్వామికి సూర్య ప్రభ, చంద్రప్రభ వాహనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. తొలుతగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామికి ఉదయాన్నే సుప్రభాత సేవ, సహస్ర నామార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతం స్వామిని సూర్యప్రభ వాహనంపై గోవిందమాలధారులు పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వాడపల్లి కమలనాథార్యుల ఆధ్వర్యంలో పలు పూజలు జరిపారు. రాత్రికి స్వామికి చంద్రప్రభ వాహనోత్సవం కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఏర్పాట్లను దేవస్థాన పాలక మండలి చైర్మన్ పడాల పెద వెంకటరెడ్డి ఇతర సభ్యులు పర్యవేక్షించారు.

గంధర్వాశ్వ వాహనంపై గ్రామోత్సవం

మామిడికుదురు: మాకనపాలెంలో వేంచేసిన అనంతలక్ష్మీ, భూదేవి సమేత సత్యనారాయణస్వామి వారి 71వ వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను గంధర్వాశ్వ వాహనంపై ఊరేగిస్తూ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ జరిగిన ఈ ఉత్సవంలో పలువురు భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం జరిగిన స్వామి వారి వ్రతాల్లో భారీ సంఖ్యలో భక్త దంపతులు కర్తలుగా పాల్గొన్నారు. స్వామికి భక్తులు అభిషేకాలు చేయించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమం ఆహుతులను విశేషంగా అలరించింది. కల్యాణోత్సవాల సందర్భంగా స్వామి వారి ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. ఉభయ దేవేరులతో కొలువుదీరిన స్వామిని దర్శించుకున్న భక్తులు తన్మయత్వం పొందారు.

ఘనంగా వార్షికోత్సవ పూజలు



నగరంలో స్వామి వార్ల వార్షిక పూజల్లో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: నగరంలో కొలువుదీరిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి, సీతారామస్వామి వార్ల ఆలయాల 6వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పలు ప్రత్యేక పూజలు చేశారు. దీనిలో భాగంగా విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, సుబ్రహ్మణ్య స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, స్వామికి సహస్రనామ పూర్వక పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు, తదితర పూజలను వైభవంగా జరిపించారు. పలువురు భక్తుల స్వామి వార్లను దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు గృహసారథులు, కన్వీనర్లకు అవగాహన సదస్సు

పి.గన్నవరం: మండలంలోని బెల్లంపూడి, యర్రంశెట్టివారిపాలెం గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం గృహ సారథులకు, సచివాలయ కన్వీనర్లకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. కార్యక్రమంలో గృహ సారథులతో పాటు, వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వాడపల్లి వెంకన్న ఆలయానికి విరాళాలు



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యుడు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తుల నుంచి విరాళాలు వెల్లువెత్తినట్లు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. పెనుమంట్రకు చెందిన బీసీహెచ్ వెంకటరత్నయ్య-కృష్ణవేణి రూ.25 వేలు, కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెంకు చెందిన ఎస్.సూరిబాబు రూ.10 వేలు, రాజోలు మండలం పొదలాడకు చెందిన ఎం.చంద్రశేఖర్ రూ.10 వేలు, రావులపాలెంకు చెందిన సి.సతీష్-శిరీష రూ.10,011, నరసాపురానికి చెందిన పి.వెంకటరావు రూ.10,005 విరాళం అందించినట్లు తెలిపారు. దాతలకు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, కమిటీ సభ్యులు చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపేట: మండలంలోని బిళ్లకుర్రు సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ వానపల్లి ఫీడర్ లైన్ మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం పది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ వానపల్లిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ ఆదివారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ముమ్మిడివరం: ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఘటనలో మోటార్ సైకిల్‌పై వెళుతున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. అంబాజీపేట మండలం జి.అగ్రహారం గ్రామానికి చెందిన దొంగ హరిప్రసాద్, కొప్పిశెట్టి శ్రీనివాస్ మోటార్‌సైకిల్‌పై యానాం వెళ్లి తిరిగి వస్తుండగా ముమ్మిడివరం మండలం కొమానపల్లి జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. తీవ్ర గాయాలపాలైన వారిద్దరిని కాకినాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ముమ్మిడివరం ఎస్ఐ కె.సురేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్తీలపై అవగాహన కల్పించాలి

అంబాజీపేట: నేటి సమాజంలో అన్ని వినియోగ వస్తువులు కల్తీమయం కావడంతో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వినియోగదారుల సమాఖ్యలపై ఉందని జాతీయ వినియోగదారుల సమాఖ్య డైరెక్టర్ చదలవాడ హరిబాబు అన్నారు. ఆదివారం ఆయన అంబాజీపేట వినియోగదారుల సంఘాన్ని సందర్శించారు. హరిబాబు మాట్లాడుతూ వినియోగ వస్తువుల కల్తీ వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో వినియోగదారుల సమాఖ్యలు కల్తీల వల్ల వచ్చే అనారోగ్య సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట అనంత్, గోవిందరావు, రామకృష్ణ, కోకోఫెడ్ అధ్యక్ష, కార్యదర్శులు అరిగెల బలరామకృష్ణ, ఆదిత్యకిరణ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా పొన్న వాహనోత్సవం

యానాం: యానాంలో కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా 14వ రోజు ఆదివారం రాత్రి పొన్న వాహనోత్సవం వైభవంగా జరిగింది. కాపగంటి సూర్యప్రకాశరావు, ఆయన కుమారులు ఉత్సవదారులుగా నిర్వహించిన పొన్నవాహనానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామి, డీటీ సత్యనారాయణన్, మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ కె.రామకృష్ణ తదితరులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

కమ్ముకున్న పొగలతో ఉక్కిరి బిక్కిరి

- డంపింగ్‌యార్డ్‌లో చెత్తకు మళ్లీ నిప్పు
- పొగలతో అవస్థలు పడిన పరిసర ప్రజలు
- ఫైరింజన్‌తో ఆర్పేందుకు ప్రయత్నాలు



డంపింగ్ యార్డులో మంటలు, పొగలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అమలాపురం టౌన్: స్థానిక బైపాస్ రోడ్డులో ప్రధాన పంట కాలువను ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డ్‌లో చెత్త గుట్టలకు శనివారం రాత్రి నిప్పంటుకుని పట్టణంలో దాదాపు కిలోమీటర్ మేర దట్టమైన పొగలు వ్యాపించాయి. దీంతో సమీపంలోని 27, 28, 29 వార్డుల ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. కమ్ముకున్న పొగల కారణంగా వృద్ధులు, చిన్న పిల్లలు ఊపిరాడక ఉక్కిరి బిక్కిరయ్యారు. రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు దారి కనిపించక ముప్పుతిప్పలు పడ్డారు. పొగ ప్రభావం బైపాస్ రోడ్డు సావరం, నల్లవంతెన నుంచి ముమ్మిడివరం గేటు, గడియారం స్తంభం సెంటర్ల వరకూ కనిపించింది. స్థానిక ప్రజలు మున్సిపల్ అధికారులకు ఫోన్లు చేసి తాము పడుతున్న ఇబ్బందులను ఏకరవు పెట్టారు.

స్పందించిన మున్సిపల్ అధికారులు

ఎండలు ముదురుతున్న సమయంలో డంపింగ్ యార్డ్‌లోని చెత్త గుట్టల్లో ఏదో చోట నిప్పు పుట్టడం, పొగలు రావడం సాధారణం. అయితే శనివారం రాత్రి చెత్త గుట్టల్లో అయిదు చోట్ల మంటలు పుట్టి దట్టమైన పొగలు రావడంతో దాదాపు 20 వేల మంది ప్రజలు ఇబ్బంది పడ్డారు. రెండు రోజుల క్రితమే డంపింగ్ యార్డులో చెత్తకు నిప్పంటుకున్నప్పుడు ఫైరింజన్ సాయంతో అదుపు చేసేందుకు మున్సిపల్ అధికారులు ప్రయత్నించారు. అయితే శనివారం రాత్రి మంటలు ఎక్కువగా వ్యాపించడం, ప్రజల నుంచి ఎదురైన ఫిర్యాదులతో అధికారులు మరోసారి స్పందించారు. ఆదివారం ఉదయమే ఫైరింజన్, అగ్నిమాపక సిబ్బందిని రంగంలోకి దింపి మంటలు, పొగలను అదుపు చేశారు. ప్రస్తుతానికి సమస్య సద్దుమణిగినా మళ్లీ మళ్లీ పొగలు వ్యాపిస్తాయేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పరిష్కార మార్గాన్ని అన్వేషిస్తున్నాం

ఇది మున్సిపాలిటీ సిబ్బంది తప్పిదం కాదు. చెత్త నిల్వల పొరల్లో మిథైన్ గ్యాస్ ఉత్పన్నమై ఉష్ణోగ్రత పీడనం పెరిగిపోయి దానికదే ఫైర్ అవుతుంది. వేసవిలో ఈ సమస్య మరీ జటిలమవుతుంది. సమస్యకు పరిష్కార మార్గాన్ని అన్వేషిస్తున్నాం.

– ఒమ్మి అయ్యప్పనాయుడు, కమిషనర్, అమలాపురం



అమలాపురం డంపింగ్ యార్డ్‌లో చెలరేగిన మంటలు

పథకాల లబ్ధిని ప్రజలకు వివరించండి



నందంపూడిలో గృహ సారథులకు కిట్‌లను అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: కుల, మత, పార్టీలకు అతీతంగా పారదర్శకంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజా ప్రభుత్వానికి బాసటగా నిలవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. వాకలగరువు, తొండవరం, నందంపూడి గ్రామాల్లో జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్ అధ్యక్షతన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలకు ఈ నెల 18 నుంచి నిర్వహించే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ ప్రతి ఇంటి తలుపు తట్టి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు మధ్యవర్తులు లేని విధంగా పారదర్శకంగా ప్రభుత్వ లబ్ధిని నేరుగా అందజేస్తోందన్నారు. ఈ సదస్సులో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ పితాని మంగాదేవి, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, వాకపల్లి శ్రీనివాసరావు, కడలి సుబ్రహ్మణ్యం, మద్దింశెట్టి వెంకటేశ్వరరావు, వెన్నపు రాంబాబు, పెచ్చెట్టి రాంబాబు, నాగాబత్తుల శ్రీను, చింతపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు వాకలగరువులో ఇటీవల పాము కాటుకు గురై మృతి చెందిన బాలుడు కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.

మాంస దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



కొత్తపేటలో మాంసం దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

కొత్తపేట: మండలంలో మటన్, చికెన్, చేపల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆదివారం దాడులు చేశారు. రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్‌బీ బాగ్చి ఆదేశాల మేరకు ఎస్పీ పీవీ రవికుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి చికెన్, మటన్, చేపల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. దానిలో భాగంగా కొత్తపేట టౌన్, మండల పరిధిలో 19 మటన్, చికెన్, చేపల దుకాణాల్లో వివిధ తనిఖీలు జరిపారు. 8 దుకాణాల్లో ఎలక్ట్రానిక్ కాటాలకు స్టాంపింగ్ లేకపోవడాన్ని గుర్తించారు. మొత్తం 9 కేసులు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ రమేష్, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, కానిస్టేబుల్స్ వలీ, కిషోర్, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.

పంట కాలువల్లో పందుల కళేబరాలు



పి.గన్నవరం వద్ద ప్రధాన పంట కాలువలో అడ్డు పడిన కళేబరం

పి.గన్నవరం: ఇటీవల వైరస్‌తో చనిపోతున్న పందుల కళేబరాలను పి.గన్నవరం ప్రధాన పంట కాలువలో పడేస్తుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పై నుంచి కొట్టుకువస్తున్న పందుల కళేబరాలు కుళ్లిపోయి తుప్పల్లో చిక్కుకుని దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. పి.గన్నవరం ప్రధాన పంట కాలువతో పాటు, దానికి అనుసంధానంగా చిన్న కాలువల్లో నీటిని చాలా మంది తాగడానికి, వంటలకు వినియోగిస్తున్నారు. వైరస్‌తో చనిపోతున్న పందుల కళేబరాలను గత నెల రోజులుగా కాలువల్లో పడేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాలువలో నీటిని వినియోగించే ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో తేలుతున్న కళేబరాలను బయటకు తీయించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి కాలువల్లో తేలుతున్న జంతు కళేబరాలను తొలగించి, పంట కాలువల్లో మృత కళేబరాలను పడేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బాలుడి వైద్యానికి చేయూత



బాలుడికి సాయం అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

రావులపాలెం: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న బాలుడికి స్థానిక శ్రీ కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు రూ.12 వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు. ఆత్రేయపురం మండలం మెర్లపాలేనికి చెందిన గార్లపాటి సూరిబాబు కుమారుడు పృథ్వీరాజ్‌కు గుండెమార్పిడి శస్త్రచికిత్స చేయాలని వైద్యులు సూచించారు. పేదరికంలో ఉన్న ఈ బాలుడి పరిస్థితి తెలుసుకున్న రావులపాలెం కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు సమకూర్చిన నగదును బాలుడికి వైద్య ఖర్చులకు అందజేశారు.

ఆకట్టుకున్న బాలబాలికల కోలాటం



మోరిలో అమ్మవార్ల ఆలయం వద్ద నిర్వహించిన బాలబాలికల కోలాటం

సఖినేటిపల్లి: మోరిలో కొలువైన మహాలక్ష్మమ్మ, కనక మహాలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర తీర్థం పురస్కరించుకుని ఆదివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన బాలబాలికల కోలాటం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. పశ్చిమగోదావరి జిల్లా మట్టపర్రుకు చెందిన షణ్ముఖ మురళీకృష్ణ, డీజే డివోషనల్ కోలాటం బృందం చిన్నారులు సుమారు 40 మంది ఇందులో పాల్గొన్నారు. చిన్నారులకు స్థానికులు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. భారీ క్యూలో వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా పుంతలో ముసలమ్మ తీర్థం

ఆలమూరు: గ్రామంలోని పుంతలో ముసలమ్మ అమ్మవారి జాతర, తీర్థం ఘనంగా జరిగాయి. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని కళాకారులు ప్రదర్శించిన గరగ నృత్యాలు, విచిత్ర వేషధారణ, సన్నాయి, బ్యాండ్ మేళాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అమ్మవారి ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదివారం పిండివంటలతో భారీ అన్నసమారాధన జరిగింది.